క్లుప్తంగా

పాఠశాలలకు ఉచిత పుస్తకాలు



నూజెండ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు అవసరమైన పుస్తకాలు మండల విద్యాశాఖ కార్యాలయానికి వచ్చాయని ఎంఈవో రవిచంద్ర సోమవారం తెలిపారు. ఇక్కడి నుంచి మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు పుస్తకాలు పంపుతామన్నారు. పాఠ్యపుస్తకాలు 21805, నోట్ పుస్తకాలు 24846, బ్యాగ్‌లు 4985, బెల్ట్‌లు 3497, డిక్షనరీలు 1063 వచ్చాయన్నారు. యూనిఫాం, షూస్ రావల్సి ఉందన్నారు. పాఠశాలల పునఃప్రారంభానికల్లా విద్యార్థులకు పూర్తి స్థాయిలో మెటీరియల్ పంపిణీ చేయటం జరుగుతుందన్నారు.

నీలి నాలుక వ్యాధికి ఉచితంగా టీకాలు



నూజెండ్ల: నీలి నాలుక వ్యాధి (మూతి జబ్బు)కి ఉచితంగా టీకాలు ఈ నెల 30 వ తేదీ వరకూ వేయటం జరుగుతుందని పశువైద్యాధికారి శివాజీ వెల్లడించారు. మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో జీవాలకు సోమవారం టీకాలు వేశారు. పశువైద్యాధికారి శివాజీ మాట్లాడుతూ ఈ వ్యాధి ముఖ్యంగా గొర్రెలకు ఎక్కువగా వస్తుందన్నారు. వ్యాధి సోకిన జీవాలకు నోరు ఎర్రబడటం, ఆహారం తినకపోవటం వంటి లక్షణాలు కన్పిస్తాయన్నారు. సకాలంలో వైద్య సేవలు అందకపోతే జీవాలు మృతి చెందుతాయన్నారు. వర్షాకాలం మొదలయ్యే ముందు వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఉచిత టీకాల అవకాశాన్ని యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నరసరావుపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ సోమవారం తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన సిద్ధి హనుమంతరావు(59) కార్పెంటర్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 4వ తేదీన నరసరావుపేటలో పెయింట్స్ సామాన్లు కొనుగోలు చేసేందుకు బెల్లంకొండ ప్రశాంత చారీతో కలిసి పట్టణానికి వచ్చాడు. ప్రశాంత చారీ వాహనం నడుపుతుండగా హనుమంతరావు వెనుక కూర్చున్నాడు. మల్లమ్మ సెంటర్ ఓవర్ బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి వీరి వాహనాన్ని వెనుకగా వచ్చిన మరో వాహనం ఢీకొంది. సంఘటనలో హనుమంతరావుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుమారుడు సిద్ధి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యడ్లపాడులో వాహన తనిఖీలు



యడ్లపాడు: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ట్రాఫిక్ నియమావళుల అమలు కోసం పోలీసులు ప్రత్యేకంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రయాణికులను అనధికారికంగా రవాణా చేస్తున్న ఐదు ట్రాన్స్‌పోర్టు వాహనాలను గుర్తించి, మోటారు వాహన చట్టం ప్రకారం ఆయా వాహనాలకు రూ.3వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ టి.శివరామకృష్ణ మాట్లాడుతూ, ప్రయాణికుల ప్రాణాలను లెక్కచేయకుండా నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రత దృష్ట్యా ఇటువంటి తనిఖీలు ఇకపై మరింత కఠినంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

చిలకలూరిపేటటౌన్: పాదాచారుడికి వెనుక నుండి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న పట్టణంలోని జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాగన్నపాలెంకు చెందిన షేక్ బాజి అడ్డరోడ్డు సెంటర్ నుంచి కె.బి.రోడ్డువైపు నడుచుకుంటు వస్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో స్థానికులు పరుగున వచ్చి బాధితుడిని పట్టణంలోని ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్సల అనంతరం గుంటూరు సమగ్ర ఆస్పత్రికి తరలించారు.

పరాయి పంచలో ఇంకెన్నాళ్లు?

- పాత ప్రభుత్వ వైద్యశాలలో కార్యకలాపాలు నిర్వర్తిస్తున్న తహసీల్దార్ కార్యాలయం
- అద్దె భవనాల్లో వెలుగు ఆఫీసు, హౌసింగ్ కార్యాలయం
- జెడ్పీ పాఠశాలలో మండల వనరుల కేంద్రం



పాత ప్రభుత్వ వైద్యశాల భవనంలో తహసీల్దార్ కార్యాలయం

నూజెండ్ల: మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాల కొరత వేధిస్తోంది. అద్దె భవనాల్లో అరకొర వసతులతో కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నారు. స్వంత కార్యాలయాలు కాకపోవటంతో అసౌకర్యాల నడుమ ఉద్యోగులు విధులు చేపట్టాల్సి వస్తోంది. పనులపై వచ్చిన ప్రజలు సైతం ప్రభుత్వ భవనాలు గుర్తించటంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పాత ప్రభుత్వ వైద్యశాలలో తహసీల్దార్ కార్యాలయం..

గతంలో తహసీల్దార్ కార్యాలయం ఎన్నెస్పీ కాలనీ క్వార్టర్ భవనంలో ఉండేది. ఇరుకు గదులు కావటం, భవనం పాత పడి నిర్వహణకు అననుకూలంగా ఉండటంతో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో నిర్మాణ పనులు కోసం పాత కార్యాలయాన్ని తొలగించారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని పాత భవనంలోనికి తాత్కాలికంగా తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చారు. అయితే సంవత్సరాలు గడుస్తున్నా భవన నిర్మాణం పూర్తి కాలేదు. పాత భవనం కావటంతో అరకొర వసతులతో విధులు కొనసాగించాల్సి వస్తోందని అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో మండల వనరుల కేంద్రం

విద్యాశాఖ ఆధ్వర్యంలో జరగాల్సిన వివిధ కార్యకలాపాలు మండల కేంద్రం ద్వారా నిర్వర్తించాల్సి ఉంది. పాఠశాలలకు పంపిణీ చేయాల్సిన పుస్తకాలు, యూనిఫాం వంటి మెటీరియల్ ఇక్కడి నుంచే సరఫరా చేస్తారు. రానురాను భవనం శిథిలావస్థకు చేరటం, చిన్నపాటి వర్షానికి కారుతుండటంతో కార్యకలాపాలను స్థానిక జెడ్పీ పాఠశాలలోని ఖాళీ భవంతిలోకి మార్చారు. ఇరుకు భవనం అయినప్పటికీ ప్రత్యామ్నాయం లేకపోవటంతో విధులు కొనసాగిస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన మండల వనరుల కేంద్రం

అద్దె భవనాల్లో వెలుగు, హౌసింగ్ కార్యాలయాలు

వెలుగు కార్యాలయం, గృహ నిర్మాణ సంస్థలు సంవత్సరాల కాలంగా పేద ప్రజలకు సేవలు అందిస్తున్నా శాశ్వత భవనాలు నిర్మించక పోవటంతో అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. డ్వాక్రా సంఘాల మహిళలకు సమావేశాలు నిర్వర్తించాల్సి వచ్చినప్పుడల్లా అధికారుల అనుమతులతో అటు మండల పరిషత్ కార్యాలయంలోనన్నా, జిల్లా పరిషత్ పాఠశాలలో గానీ మీటింగ్‌లు పెట్టుకోవాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. అద్దె భవనాల్లో మరుగుదొడ్ల సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉండటంతో మహిళా ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హౌసింగ్ కార్యాలయం అద్దె చెల్లింపులు భారంగా మారిందని సిబ్బంది అంటున్నారు.

రాబోయే రోజుల్లోనైనా ఆయా శాఖల అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉక్కు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కార్మిక సంఘాల డిమాండ్

నరసరావుపేట ఈస్ట్: విశాఖ ఉక్కు పరిశ్రమలో అన్యాయంగా తొలగించిన 5,400 మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం చిత్రాలయ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పలపాటి రంగయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.శివకుమారి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విశాఖ ఉక్కు పోరాటంపై తీవ్ర ఆంక్షలు విధిస్తూ పోలీసులను మోహరించి కార్మికులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డూడూ బసవన్నలా తలూపుతూ ప్రజాస్వామిక పోరాటాలను అడ్డుకుంటున్నారని తెలిపారు. ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను విస్మరిస్తూ ప్రజల ప్రాణ త్యాగాలకు గుర్తింపు లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కుకు ఘనుల కేటాయించక పోవటంపై కేంద్రాన్ని చంద్రబాబు ఎందుకు ప్రశ్నించటం లేదని నిలదీశారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు వెంటనే ఘనులు కేటాయించాలనీ, ప్రైవేటీకరణ విధానాలను విడనాడి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు షేక్. చినజాన్ సైదా, నాగేశ్వరరావు, సత్యనారాయణ రాజు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



చిత్రాలయ సెంటర్‌లో ఆందోళన నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం



చిలకలూరిపేట: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం పనిచేస్తున్నదని ఆ సంఘ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు చెప్పారు. ఎస్టీయూ 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘ కార్యాలయంలో సోమవారం ఎస్టీయూ పతాకం ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్టీయూ ఆవిర్భవించిందన్నారు. నేడు ఉపాధ్యాయులు పొందుతున్న అనేక సౌకర్యాల కల్పన కోసం సంఘం ఎన్నో ఉద్యమాలు చేసిందన్నారు. ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు ముగ్దుం మోహిద్దీన్, వీణ విజయరామ రాజు వంటి వారు చేసిన కృషి నేటి ఉపాధ్యాయులకు స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వి.అక్కయ్య, సీహెచ్ మల్లేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, బి.అజయ్‌ప్రకాశ్, బి. రవి, సీహెచ్ వీరయ్య పాల్గొన్నారు.

నాదెండ్లకు చేరిన మొదటి విడత పాఠ్యపుస్తకాలు

నాదెండ్ల: ప్రభుత్వ పాఠశాలలు ఈ నెల 12 నుంచి పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం నుంచి పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. పాఠ్య పుస్తకాలతో పాటూ నోటు పుస్తకాలు, డిక్షనరీలను ఆయా పాఠశాలలకు ప్రత్యేక వాహనాల్లో చేర్చారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కానుక ద్వారా 1-10వ తరగతుల వరకూ 25,032 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా, మొదటి విడతగా 18,305 పుస్తకాలు అందగా రెండో విడతగా సోమవారం అందాయి. మండలంలో 48 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 9 జిల్లా పరిషత్, నాదెండ్ల కస్తూర్బా గాంధీ, చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలకు గాను ఈ ఏడాది 5,135 బ్యాగులు అవసరం కాగా ఇప్పటికే మొత్తం చేరాయి. పాఠశాలల ప్రారంభం తొలిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగు, షూ, బెల్టు, యూనిఫాం అందించనున్నట్లు ఎంఈవో-2 ఈమని కృష్ణారెడ్డి తెలిపారు. పంపిణీ కార్యక్రమాన్ని సీఆర్‌పీలు భవాని, ఇందిర, సింగయ్య, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు పావని, జ్యోతి, శ్రీలక్ష్మి, హేమలత, అమీర్, సుస్మిత, బాబు పర్యవేక్షించారు.



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

ఘనంగా ఉరుసు మహోత్సవం



చిలకలూరిపేటటౌన్: మండలంలోని పసుమర్రు గ్రామంలో తొలిసారిగా హజరత్ పీర్ మొహమ్మద్ ముక్తారుల్లాషా అమిరి చిష్టీవుల్ ఖాదిరి వారి ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. జగనన్నా కాలనీ ఎదురుగా ఉన్న మదరసా ప్రాంగణంలో ఈ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగింది. ఉత్సవానికి హజరత్ వారి నివాసం నుంచి వంశీయులు గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకువచ్చారు. అనంతరం ముక్తారుల్లాషా సమాధిపై పూలచద్దర్ వేసి ఆయన ప్రియశిష్యులు ప్రత్యేక దువా నిర్వహించారు. ముఫ్తి అబ్దుల్ కలీంసాహెబ్, మౌలానా బాజీసాహెబ్, సుల్తాన్, సాధిక్, హాఫీజ్ సాఖిబ్ మిలాద్ చదవడంతో పాటు బయాన్, ఖురాన్ బోధన నిర్వహించగా, శ్రద్ధాభక్తులతో భారీగా భక్తులు హాజరయ్యారు. సుదూర ప్రాంతాల నుంచి కార్యక్రమానికి హాజరైన వేలాది మందికి అన్నదాన నిర్వహించారు. ఉరుసు సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మికతతో నిండిపోయింది.

సంక్షిప్త వార్తలు

ఆత్మరక్షణకు కరాటే



నరసరావుపేట ఈస్ట్: క్రమశిక్షణ, ఆత్మస్థైర్యాన్ని అందించటంతో పాటు ఆత్మరక్షణకు కరాటే మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని సీనియర్ కరాటే మాస్టర్ పి.రాంబాబు తెలిపారు. రోడ్ ట్రాక్ ఫినిక్స్ ఆధ్వర్యంలో హిందూ స్కూల్ ఆవరణలో కరాటే బెల్ట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. పోటీలకు పరిశీలకునిగా హాజరైన రాంబాబు మాట్లాడుతూ, పాఠశాల విద్య నుంచే మార్షల్ ఆర్ట్స్ పట్ల అవగాహన కలిగి ఉండటం ద్వారా శారీరక, మానసిక ధృఢత్వంతో పాటు చదువులోనూ రాణిస్తారని వివరించారు. బాలికలు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రవేశం కలిగి ఉండటం ద్వారా నేటి సమాజంలో ఎటువంటి వత్తిడినైనా ఎదుర్కొగలరని తెలిపారు. కాగా, పోటీల్లో వివిధ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్‌ల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి పోటీలను నిర్వహించి అర్హతల మేరకు బ్లాక్, పర్పుల్, బ్రౌన్, ఆరంజ్, ఎల్లో, గ్రీన్ బెల్ట్‌లు కేటాయించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ జి.సాయిరామ్, పాఠశాల డైరెక్టర్ మానస, అసోసియేషన్‌ల కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల యోగా ర్యాలీ



నరసరావుపేట: యోగాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం మున్సిపల్ ఉద్యోగులు సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమై స్టేషన్ రోడ్డులోని గాంధీపార్కు వరకు కొనసాగింది. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.అచ్యుతరావు, ఉద్యోగులు, మెప్మా మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమ వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలకరించి కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు అడిగొప్పల చెన్నకేశవచార్యులు ఆలయ కమిటీ నిర్వాహకులు వెంకటేశ్వర్లు, బోయరామిరెడ్డి, నర్సయ్య, రమణారెడ్డి, సైదులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో నట్టు రాధ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారు-బైక్ ఢీ: వ్యక్తికి గాయాలు

పిడుగురాళ్ల: కారు- ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలోని మెడికల్ కాలేజీ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. పిడుగురాళ్ల నుంచి దాచేపల్లి వైపు వెళ్తున్న కారు అలాగే అటుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొడంతో ప్రయాణిస్తున్న నరసరావుపేటకు చెందిన వ్యక్తి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108లో పిడుగురాళ్ల పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటనపై పట్టణ ఎస్ఐ మోహన్ దర్యాప్తు చేపట్టారు.

ట్రాన్స్‌పోర్టు డ్రైవింగ్ శిక్షకులకు సర్టిఫికెట్లు అందజేత

నరసరావుపేట: స్థానిక రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో గత నెల రోజుల నుంచి ట్రాన్స్‌పోర్టు వాహనాలు డ్రైవింగ్ శిక్షణ తీసుకున్నవారికి సోమవారం ఫారం 5 సర్టిఫికెట్లను బీజేపీ నాయకుడు రంగిశెట్టి రామకృష్ణ అందజేశారని ఆ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ కనకదుర్గ పద్మజ తెలిపారు. ఎంవీఐ డి.నాగేశ్వరరావు, బంగారయ్య పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌పై మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ

నరసరావుపేట: స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి వాక్సినేషన్ మార్గదర్శకాలపై మెడికల్ ఆఫీసర్లకి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ బుధవారం వరకు జరగనుంది. దీనికి జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా, సామాజిక ఆసుపత్రుల నుంచి 90 మంది మెడికల్ ఆఫీసర్లు హాజరయ్యారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక, జిల్లా టీకాల అధికారి డాక్టర్ బి.గీతాంజలి, జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.పద్మావతి, డాక్టర్ హనుమకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ వర్గీయులపై అక్రమ కేసు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: గత నెల 11న రొంపిచర్ల మండలం ఎడ్వర్డుపేట గ్రామంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువర్గాల వారికి ఒకటే రకమైన దెబ్బలు తగిలాయని, కానీ వైఎస్సార్ సీపీ వారిపై హత్యాయత్నం కేసుపెట్టి టీడీపీ వర్గీయులపై స్టేషన్ బెయిల్ ఇచ్చి చిన్న కేసులు పెట్టి బయటకు పంపించడాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. సోమవారం స్థానిక సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను నరసరావుపేట, రొంపిచర్ల మండల నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం జైలు ప్రాంగణం బయట మీడియాతో మాట్లాడారు. కారు అద్దాలు పగలగొట్టి మళ్లీ తిరిగి వారిపైనే కేసులు పెట్టారనీ, ఒక ముస్లిం మైనార్టీ యువకుడి ఇంటిపై దాడిచేసి అతని కారు అద్దాలు పగలగొట్టి, మళ్లీ అతని మీదే కేసు పెట్టారన్నారు. ఇది చాలా దారుణమని పేర్కొన్నారు. అదేవిధంగా ములకలూరు గ్రామంలో ఇర్ఫాన్ అనే యువకుడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను విమర్శించాడనే కారణంతో అక్రమంగా కేసు పెట్టి రిమాండ్‌కు పంపారన్నారు. ప్రస్తుత స్పీకర్ అయ్యన్నపాత్రుడు గత ప్రభుత్వంలో నకరికల్లు మండలం కండ్లగుంట గ్రామంలో విగ్రహావిష్కరణకు వచ్చి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని దుర్భాషలాడాడని, అయినప్పటికీ అతనిపై తమ ప్రభుత్వం కేసు పెట్టలేదని, జైలుకు పంపలేదని, గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తుందని అన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలుచేయకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా కేసులు పెట్టి జైలు పాలు చేసి ప్రజల దృష్టి మళ్ళిస్తుందన్నారు. విధంగా ప్రతి ఒక్కరి మీద అక్రమ కేసులు పెడుతుంటే, రాష్ట్రంలో వచ్చేందుకు ప్రజలు ఎవరూ ఇష్టపడరని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అక్రమ కేసులపై రిమాండ్‌లో ఉన్న వారికోసం కోర్టును ఆశ్రయిస్తున్నామని, ఇక్కడ బెయిల్ రాకపోతే, హైకోర్టుకు వెళ్లి న్యాయబద్ధంగా పోరాటం చేస్తామన్నారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలబడతామని తెలియజేశారు, రొంపిచర్ల మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.



రిమాండ్‌లో ఉన్న వారి బంధువులతో జైలు బయట మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి

ఆరుగురు విద్యార్థులకు 'షైనింగ్ స్టార్' పురస్కారాలు

నాదెండ్ల: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ పురస్కారాన్ని మండలానికి చెందిన ఆరుగురు విద్యార్థులు అందుకున్నారు. నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో ఒక్కో విద్యార్థికి రూ.20 వేలు నగదు ప్రోత్సాహకం, జ్ఞాపిక, ధృవపత్రాలు అందించారు. తూబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పత్తిపాటి అమూల్య (593), చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పిట్టల విజయలక్ష్మి (591), సాతులూరు ఈతరం హైస్కూలుకు చెందిన షేక్ షహీరా (588), కిలారు తిరుమలభువనశ్రీ (583), చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన మెగావత్ జయశ్రీ (583), గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మాలెంపాటి నాగసతీష్‌కుమార్ (575) పురస్కారాలు అందుకున్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మండలంలో టాపర్‌గా నిలిచిన పత్తిపాటి అమూల్యను ప్రత్యేకంగా అభినందించారు. ఎంఈవో-2 ఈమని కృష్ణారెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.



నాదెండ్ల మండల టాపర్ పత్తిపాటి అమూల్యను అభినందిస్తున్న ఎంపీ కృష్ణదేవరాయలు



సాతులూరు ఈతరం పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

పెడదారి పట్టిస్తున్న ఐపీఎల్ మ్యాచ్‌లు రద్దు చేయాలి

ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి మల్లిఖార్జున్ డిమాండ్

చిలకలూరిపేట: యువతను పెడదారి పట్టిస్తున్న ఐపీఎల్ మ్యాచులను రద్దు చేయాలని ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి మల్లిఖార్జున్ డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లను రద్దు చేయాలని కోరుతూ సోమవారం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున్ మాట్లాడుతూ తాము క్రీడలకు వ్యతిరేకం కాదని, ఐపీఎల్ మ్యాచ్‌ల కారణంగా యువత బెట్టింగ్ బాట పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంగా ఐపీఎల్ మ్యాచ్‌కు యువతకు శాపంగా మారి వారిని వీధి పాలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెట్టింగ్ కారణంగా ప్రాణాలు తీసుకున్న వారు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా జరుగుతున్న బెట్టింగులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించలేక పోతున్నాయన్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రవివర్మ, లక్ష్మిపతి, నజీర్‌ఖాన్ పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఆహార పదార్థాల కల్తీతో అనారోగ్య సమస్యలు

చిలకలూరిపేట: ఆహార పదార్థాల్లో కల్తీ పెరిగిపోయిన కారణంగా అనారోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని హోమియో వైద్యురాలు డాక్టర్ సిద్ధాబత్తున ఉమాదేవి చెప్పారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, ఉమాస్ హోమియో క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని సుగాలికాలనీలో సోమవారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం, మానసిక ఆరోగ్యంతో అనేక వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని వివరించారు.

పెరిగిన వాతావరణ కాలుష్యం, జీవనశైలిలో వచ్చిన మార్పులు కూడా అనారోగ్య సమస్యలకు కారణమౌతున్నాయన్నారు. ఆలస్యంగా నిద్ర పోవడం, శారీరక శ్రమ చేయకపోవడం, దురలవాట్లు అనారోగ్య సమస్యలకు హేతువులుగా నిలుస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వివిధ వ్యాధులకు సంబంధించి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని, కార్యదర్శి నార్నే జయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఉమాదేవి

ముగిసిన ఉచిత యోగ శిక్షణ శిబిరం

నరసరావుపేట రూరల్: శ్రీ వెంకటేశ్వర యోగ సేవ కేంద్రం ఆధ్వర్యంలో రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఉచిత యోగ శిక్షణా శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు ఆనంద మహోత్సవం పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వర యోగ గురూజి చరవాణీద్వారా అనుగ్రహ భాషణం అందించారు. శిబిరంలో 28 రోజుల పూర్తి హాజరై శ్లోకాలు రాసి అప్పజేప్పిన వారందరికీ బోధక యోగాచార్యులు జల్లి శ్రీనివాసరావు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. యోగ శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు జీవిత పర్యంతం ఒక్క అర గంటైనా సాధన చేయాలని, తద్వారా ఆరోగ్యంగా ఆనందంగా సంతోషంగా ఉంటారని యోగాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో కనుమూరి రాజ్యలక్ష్మి, వంకాయల హరగోపాల్, సహాయక గురువులు బండి కొండారెడ్డి, రావూరి సాంబశివరావు పాల్గొన్నారు.

